## క్లుప్తంగా

### విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత

**మిర్యాలగూడ :** దామరచర్ల మండలంలోని గణేష్పాడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు శుక్రవారం బంజారా మహిళ ఎన్జీఓ డాక్టర్ ఆనంద్, సుజాత, పూర్ణిమ సంయుక్తంగా పలకలు, పెన్నులు అందించి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలి

**మిర్యాలగూడ టౌన్ :** అవంతిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం ఎ. శ్రీనివాస్, మురళి, సిద్ధంరాజు, నరేష్, గంగాధర్, హరిగౌడ్, ఉపేందర్, రవి తదితరులున్నారు.

### బీజేపీ చిరుమర్తి గ్రామ కమిటీ ఎన్నిక

**మాడుగులపల్లి :** మండలంలోని చిరుమర్తి గ్రామంలో బీజేపీ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా అకిటి గిరి, ఉపాధ్యక్షుడిగా మోదుగు సతీష్‌రెడ్డి, కార్యదర్శులు నవీన్, గోపి, యువజన విభాగం అధ్యక్షుడిగా మాదరబోయిన మహేష్‌తోపాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తమ ఎన్నికకు సహకరించిన మండలాధ్యక్షుడు బొమ్మకంటి నర్సింహ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

### క్రికెట్ కిట్లు అందజేత

**డిండి:** మండల పరిధిలోని ఎడ్లగడ్డతండాకు చెందిన క్రీడాకారులకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్ సోమవారం క్రికెట్ కిట్లను అందజేశారు. ఆయన వెంట రవి, శ్రీను, మల్లేష్‌నాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### హామీలను అమలు చేయాలని వినతి




తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

**మిర్యాలగూడ అర్బన్ :** కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వస్కుల మట్టయ్య అన్నారు. సోమవారం మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు వస్కుల సైతమ్మ, పోతుగంటి కాశి, భరత్, జ్యోతి, మోహన్‌నాయక్, ఆశీర్వాదం, సైదులు, నాగయ్య, లింగమ్మ, రమణ, రామకృష్ణ, శ్రీను తదితరులున్నారు.

### ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



తిరుపతికి బస్ సర్వీసును ప్రారంభిస్తున్న సైదులు

**దేవరకొండ :** ప్రయాణికులు ఆర్టీసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఆర్టీసి డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు అన్నారు. దేవరకొండ నుండి తిరుపతికి నడుపనున్న సూపర్ లగ్జరీ బస్ సర్వీసును ఆయన ప్రారంభించి మాట్లాడారు. బస్ సర్వీసు ఉదయం 10గంటలకు దేవరకొండ నుండి బయల్దేరి హైదరాబాద్‌కు వెళ్తుందని అక్కడి నుండి మధ్యాహ్నం 2:30గంటలకు బయల్దేరి మాల్, కొండమల్లేపల్లి, నాగార్జునసాగర్ మీదుగా తిరుపతి చేరుకుంటుందని తెలిపారు. ప్రతి రోజు దేవరకొండ డిపో నుంచి బస్సు సర్వీసు నడుస్తుందని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి, తిరుపతి వెళ్లాల్సిన ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, కార్మికులు, ఉన్నారు.

### బస్ సౌకర్యం కల్పించాలి

**నల్లగొండ రూరల్:** నల్లగొండ నుంచి సూరారం, నకిరేకల్ ఆరెగూడెం వరకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవికి సూరారం గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్ వినతి పత్రం అందజేశారు. బస్ సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, సమయానుకూలంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బాబురావు, సత్యనారాయణగౌడ్, రమేష్, లింగయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**త్రిపురారం :** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని రాగడప ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కల్యాణి అన్నారు. సోమవారం మండలంలోని రాగడపలో గడప గడపకు తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ విద్యాసంస్థలను సద్వినియోగం చేసుకోవాలి**

**దేవరకొండ :** ప్రభుత్వ విద్యాసంస్థలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కోరారు. సోమవారం దేవరకొండ నియోజకవర్గ పరిధిలో గల ఆయా జూనియర్ కళాశాలల్లో ఎంకేఆర్ కళాశాలకు చెందిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అననంతరం కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో దోస్త్ అడ్మిషన్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. అంతేగాకుండా కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సునీత, ఎంకేఆర్ కళాశాల దోస్త్ కో–ఆర్డినేటర్ బాల, అధ్యాపకులు లింగారెడ్డి, లింగమయ్య, రేణుక, సురేష్, వెంకటయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : బాలికల జూనియర్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి**

**గుర్రంపోడు :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హెచ్ఎంలకు సమభావన సంఘాలతో కుట్టించిన యూనిఫామ్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా సమకూర్చుతున్న వసతులు, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు, మధ్యాహ్నభోజనం తదితర సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఇటికాల రమేష్‌కుమార్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

**నాగార్జునసాగర్ :** బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని నాట్కో‌ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బ్యానర్లు, ప్లకార్డులతో నందికొండ పైలాన్‌కాలనీలో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. చదువుతోనే అభివృద్ధి జరుగుతుందని, అందరూ చదువుకుంటేనే ఎదుగుతారన్నారు. ఇంటింటికి వెళ్లి చదువు యొక్క ప్రాధాన్యతను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాట్కో‌ట్రస్ట్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, సతీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపోడు : హెచ్ఎంలకు యూనిఫామ్స్ అందిస్తున్న ఎంఈఓ తరి రాము



త్రిపురారం : రాగడపలో..

# మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

- ఎమ్మెల్యే బాలునాయక్

**దేవరకొండ :** పోలీసులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబుతో కలిసి నియోజకవర్గ పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత గంజాయికి బానిసలుగా మారకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎక్కడైనా గంజాయి రవాణాకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. దేవరకొండ పట్టణంలో చోరీలను అరికట్టేందుకు పక్కా ప్రణాళికతో పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజజకవర్గ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ నిరంతరం కృషి చేయాలన్నారు. సాధారణ ప్రజలకు పోలీసు అధికారులు నిత్యం అందుబాటులో ఉండి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సీఐలు నర్సింహులు, ధ నుంజయ, ఆయా మండలాల ఎస్ఐలు సతీష్, అజ్మీరా రమేష్, యాదయ్య, రామ్మూర్తి, సైదులు, రాజు, తదితరులున్నారు.

**సమన్వయంతో పనిచేయాలి**

**చందంపేట :** నేరెడుగొమ్ము మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం నేరెడుగొమ్ము ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, తాగునీరు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు ఎంపిటిసిలు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభలో ప్రస్తావించారు. కాగా ఆ తర్వాత ఎమ్మెల్యే బాలునాయక్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపిపి బిక్కునాయక్, వైస్ ఎంపిపి సరోజ, జెడ్పిటిసి బాలునాయక్, ఎంపిడివో ఝాన్సిలక్ష్మిబాయి, తహసీల్దార్ ఉమా, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, వైద్యాధికారి చందునాయక్, మాజి సర్పంచ్ పాపానాయక్, యుగేందర్‌రెడ్డి, లోకసాని కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

# అభినయ్‌కు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అభినందన

**హాలియా :** ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో తిరుమలగిరి మండలంలోని బట్టువెంకన్నబావితండాకు చెందిన జటావత్ చందునాయక్, సాలమ్మ కుమారుడు జటావత్ అభినయ్ ఆలిండియా 131 ర్యాంకు సాధించాడు. సోమవారం సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి హాలియా పట్టణంలో జేఈఈ అడ్వాన్స్ ఆలిండియాలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థి జటావత్ అభినయ్‌ను, తల్లిదండ్రులు జటావత్ చందునాయక్, సాలమ్మను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, నాయకులు కుర్ర శంకర్ నాయక్, నరేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

**నాణ్యమైన విద్య అందించాలి**

**హాలియా :** పట్టణంలో నూతనంగా ఏర్పాటైన శ్రీ శ్లోక స్కూల్ విద్యాసంస్థ యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యా అభివృద్ధికి తోడ్పాటునందించాలని సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హాలియా పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శ్లోక స్కూల్ విద్యాసంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్స్ నవీన్, సంతోష్, నవీన్‌కుమార్, నరేష్, ప్రిన్స్‌పాల్ సిద్ధికి ఉన్నారు.



అభినయ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

# రైతు భరోసా తక్షణమే జమ చేయాలి

**దేవరకొండ :** వానాకాలం రైతు భరోసా తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ వానాకాలం వచ్చినప్పటికీ రైతులకు అందించాల్సిన పంట పెట్టుబడి సాయంపై గురించి కాంగ్రెస్ నోరు మెదపడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాన చినుకు పడితే రైతుబంధు నగదు రైతుల ఖాతాల్లో జమయ్యేవని ఆయన తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా ఎకరాకు రూ..7500 రైతు బంధు సాయం అందించాలన్నారు. ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉండాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ అర్బన్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి– అద్దంకి బైపాస్ రోడ్డుపై తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు స్థానిక డీఎస్పీ రాజశేఖరరావు, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో కలిసి పరిశీలించారు. వేములపల్లి, శెట్టిపాలెం, అన్నపురెడ్డిగూడెం, చిల్లాపురం, చింతపల్లి, నందిపాడు, చిల్లాపురం, ఈదులగూడ జంక్షన్లతో పాటు రామచంద్రగూడం వై జంక్షన్లను పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండు బైపాస్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు అత్యంత ప్రమాద కరంగా ఉన్న స్పాట్లపై పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్, టూ టౌన్, రూరల్ సీఐలు సుధాకర్, నాగార్జున, వీరబాబు తదితరులున్నారు.

**జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక**

**మిర్యాలగూడ :** జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం దామరచర్ల మండలంలోని కల్లెపల్లి గ్రామంలో నిర్వహించి ఉప్పల మైసమ్మ తల్లి జాతరలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, పోలీసులు

# కాల్వ కట్ట కబ్జాలను అరికట్టాలని వినతి



తహసీల్దార్ హరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సబ్బారెడ్డిగూడెం గ్రామస్తులు

**మిర్యాలగూడ టౌన్ :** తడకమళ్ల మూసి కాల్వ కట్ట కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరుతూ మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడెం గ్రామస్తులు తహసీల్దార్ హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సుబ్బారెడ్డిగూడెం గ్రామస్తులు మాట్లాడుతూ ఈ కాల్వ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు కింద ఉన్న రైతులకు సాగునీరందిస్తుందని తెలిపారు. ఈ కాలువ కట్టను జేసీబీ ద్వారా కాలువ కట్ట విస్తీర్ణాన్ని తగ్గించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సుబ్బారెడ్డిగూడెం గ్రామస్థులు మంద శివ, ఇంద్రపల్లి గురువయ్య, రెమడాల ఏసు, ఇంద్రపల్లి అభి, మంద సైదులు, మంద నగేష్, మచ్చ నగేష్, నాయకులు తాళ్లపల్లి రవి, దూళిపాల ధనుంజయనాయుడు, చిలకరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

**మిర్యాలగూడ :** రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, నాసిరకం విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ పోరెడ్డి నాగమణి ఫర్టిలైజర్ షాపు యజమానులను హెచ్చరించారు. సోమవారం దామరచర్లలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తనాల దుకాణదారుల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రశీదు తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. లాట్ నంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకోవాలని, బీటీ 3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఆ విత్తనాలను విక్రయించినా, సాగు చేసినా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఏఓ కల్యాణ్‌చక్రవర్తి, ఏఈఓ రమేష్ తదితరులు ఉన్నారు.



దామరచర్లలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగమణి

**లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి**

**పెద్దవూర :** లైసెన్స్ కలిగి ఉన్న రైతుల వద్దనే రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలని ఏఓ సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని పలు దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలని ఆయన సూచించారు.

## కుక్కల బెడదతో బెంబేలు

**మాడుగులపల్లి :** మండలంలోని గండ్రవానిగూడెం గ్రామంలో కుక్కల బెడదతో గొర్రెల కాపరులు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం రహదారి గుండా వచ్చి వెళ్లే సమయంలో ఇటుక బట్టీల సమీపంలో కుక్కల గుంపు మందపై దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల దాడి చేసి పదిపైగా గొర్రె పిల్లలను గాయపరిచాయని, అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకొని కుక్కల బెడదను నివారించాలని కోరారు. కుక్కల బెడద నివారణకు ఇటుక బట్టీల యాజమన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి



ఏరియా ఆస్పత్రి ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యసిబ్బంది

**నాగార్జునసాగర్ :** ఆరోగ్యశాఖలో బదిలీల ప్రక్రియను ప్రారంభించి, పారదర్శకంగా నిర్వహించాలని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రి వైద్యసిబ్బంది హాస్పిటల్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ భానుప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. పదేళ్లకు పైగా ఆస్పత్రిలో తిష్టవేసిన వైద్యులకు, స్థానచలనం కలిగిస్తూ రెండేళ్లకు మించి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు అవకాశం కల్పించాలని కోరారు. సాధారణ బదిలీలకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను త్వరగా రూపొందించాలని డిమాండ్ చేశారు. బదిలీల తర్వాతనే పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

# ప్రజలకు సురక్షిత నీరు అందించాలి

**నల్లగొండ టూటౌన్:** నల్లగొండ పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తాగునీటి విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వచ్చినందున ప్రతి ఉద్యోగి, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పైప్‌లైన్ లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను పరిశుభ్రం చేయాలని, తగిన మోతాదులో క్లోరిన్ వేసి శుభ్రపరచాలన్నారు. నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. నల్లా గుంతల వద్ద మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డీఈ అశోక్ కుమార్, ఏఈ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సర్వే సమగ్రంగా ఉండాలి

**మిర్యాలగూడ టౌన్ :** అంగన్‌వాడీ టీచర్లు సర్వే సమగ్ర ఉండాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమత అన్నారు. సోమవారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల శ్రీ సత్యసాయి మందిరంలో జరిగిన మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్వేలో ఉన్న పిల్లలందరికీ నాణ్యమైన ఎత్తు, బరువులను తీసి ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ గుర్తించాలని, గుర్తించిన ఈ బరువులు ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 డెటాతో సమానంగా, సమగ్రంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కొత్తగా ఇచ్చిన వెయింగ్ మిషన్లను ఉపయోగించి అందరూ సరైన పద్ధతిలో కచ్చితమైన బరువులను గుర్తించాలని వివరించారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, వారిలో తీవ్రలోప పోషణ, అతి తీవ్ర పోషణ కలిగిన పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ అందించాలని సూచించారు. నల్లగొండ ఐటీడీసీ రమాదేవి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌టీఎస్ సర్వే 100శాతం పూర్తి చేయాలని, టీచర్లకు ఎమైన టెక్నికల్ ప్రాబ్లమ్స్‌పైనా సందేహాలు నివృత్తిని చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, మాధవి, పద్మ, లీలాకుమారీ, రాధిక, సుశీల, నజిమాబేగం, బ్లాక్ కో ఆర్డినేటర్ కవితలతో పాటు టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ మమత

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్క నాటుతున్న ఎంపీపీ, అధికారులు

**అడవిదేవులపల్లి :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, ఎంఈఓ బాలాజీనాయక్, ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కను నాటి పెరుగుతున్న కాలుష్యాన్ని యంత్రిచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మోసిన్‌బిన్ అహ్మద్, లావూరి సూరానాయక్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, అమీర్‌అలీ, శంకర్, గ్రామ పంచాయితీ కార్యదర్శి దుర్గయ్యలతో పాటు పలువురు సిబ్బంది తదితరులున్నారు.

# ముగిసిన సమ్మర్ క్యాంపు శిక్షణ

**మిర్యాలగూడ టౌన్ :** మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని క్లియో స్పోర్ట్స్ మైదానంలో 45రోజులుగా జరుగుతున్న బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ అశోక్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఏచూరి శ్రీనివాస్‌లు పాల్గొని మాట్లాడుతూ ఈ మైదానంలో వేసవి మొత్తంలో కబడ్డి, బ్యాడ్మింటన్, క్రికెట్ క్యాంపులు 45రోజుల పాటు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరిలో పట్టుదల అనేది ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. సీనియర్ క్రీడాకారులు శ్రీధర్, రహీంలు ఎంతో ఓపికతో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించి శిక్షణ శిబిరం ముగించడంపై అభినందించారు. ఈ ఈ కార్యక్రమంలో అజీజ్ హష్మి, బ్యాడ్మింటన్, కబడ్డి, క్రికెట్ కోచ్‌లు ఎం. రామకృష్ణ, వెంకటేశ్, క్లియో స్పోర్ట్స్ సిబ్బంది శ్రీకాంత్, నరేందర్, పీఈటీ వెంకటరత్నం ఉన్నారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డాక్టర్ అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు

# మంచి నీటి బావి పరిశీలన

**త్రిపురారం :** మండలంలోని పెద్ద దేవులపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్(సీటీఓ–5) ఆధ్వర్యంలో గ్రామంలోని రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన మంచి నీటి బావి నుంచి పెద్దదేవులపల్లి, నర్లకంటి గూడెంలకు 30ఏళ్ల నుంచి మంచి నీటిని అందజేస్తున్నారు. అయితే కలుషితమైన నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ల్యాబ్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన ఇరిగి క్రాంతి కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం కలెక్టర్ ఆదేశానుసారం త్రిపురారం ఎంపీడీఓ సత్యప్రభ, ఇన్‌చార్జ్ ఎంపీఓ రాజేంద్రకుమార్‌లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ లైజన్ ఆఫీసర్ శరత్ చంద్రారెడ్డితో కలిసి మంచి నీటి బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా బావిలోని నీటిని, బోర్ల ద్వారా వచ్చే నీటిని సేకరించి జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపించారు. అనంతరం మంచి నీటి బావికి ఫిల్టర్ బెడ్డు వేసి శుభ్రం చేయించి తక్షణమే కప్పు ఏర్పాటు చేయాలని ల్యాబ్ అధికారులను ఎంపీడీఓ సత్యప్రభ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజేంద్ర కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ గాంధీ, పంచాయతీ కార్యదర్శి జాఫర్, ఠాకూర్ రమేష్ సింగ్, సింగ్ సతీష్, యానక బాలకృష్ణ పాల్గొన్నారు.



మంచినీటి బావినపరిశీలిస్తున్న ఎంపీడీఓ

# శ్మశానవాటికను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



శ్మశానవాటికను పరిశీలిస్తున్న సీపీఎం, కాంగ్రెస్ నాయకులు

**వేములపల్లి :** చెరువు మట్టి పేరుతో శ్మశానవాటికను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం మండలంలోని మొల్కపట్నం ఊరు చెరువు సమీపంలోగల శ్మశానవాటికను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు అక్రమార్కులు ప్రభుత్వ అనుమతి లేకుండా ట్రాక్టర్లతో చెరువు మట్టిని తరలిస్తూ సమీపంలో ఉన్న శ్మశానవాటికను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఇంతా జరుగుతున్నా ఐబీ, రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రశ్నించినవారిపై అక్రమార్కులు భయబ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికను ధ్వంసం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పాదూరి కిరణ్‌రెడ్డి, సీపీఎం గ్రామశాఖ అధ్యక్షుడు బొమ్మగాని ఎల్లయ్య, రెమడాల కరుణాకర్, సోమయ్య, కందిమళ్ల పాపిరెడ్డి, బారి సైదులు, మేరెడ్డి వృద్వీరెడ్డి, కప్పి అంజయ్య, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**రామగిరి(నల్లగొండ):** గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీఓ జానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జానయ్య మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో 15, 16 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో చంద్రయ్య, మల్లయ్య, వెంకన్న, పరమేష్, నాగయ్య, సౌందర్యలు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు